దుకాణాలే టార్గెట్

- రాత్రి వేళల్లో కొరవడిన గస్తీ
- రెచ్చిపోతున్న దొంగలు
- ఇటీవల 15కుపైగా దుకాణాల్లో చోరీ
- హడలిపోతున్న వ్యాపారులు



ఆదూరుపల్లిలోని కూల్‌డ్రింక్ షాపులో జరిగిన చోరీపై వివరాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)

చేజర్ల: మండలంలో రాత్రి వేళల్లో పోలీసు గస్తీ కొరవడడంతో దొంగలు రెచ్చిపోతున్నారు. దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో ఆదూరుపల్లి, తిరుపతి నాయుడుపల్లి, ఎన్వీ కండ్రిక, వావిలేరు, తదితర గ్రామాల్లో సుమారు 15 షాపుల్లో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. అందులో చిల్లర దుకాణాలు, కూల్‌డ్రింక్, మందుల షాపులు ఉన్నాయి. కలువాయి–పొదలకూరు మెయిన్‌రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు పక్కనున్న దుకాణాల్లోనే దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇటీవల ఆదూరుపల్లిలోని ఓ దుకాణంలో రాత్రి వేళ దొంగలు చోరీకి పాల్పడ్డారు. అంతకుముందు మెడికల్ షాపులో చోరీకి యత్నించారు. ఏమి దొరకకపోవడంతో వెనుదిరిగారు. అయినా పోలీసులు చోరీలను కట్టడి చేయలేకపోతుండడంపై వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కెమెరాలు చాలాచోట్ల పనిచేయడం లేదు. దీనికితోడు రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ సైతం అంతంత మాత్రంగానే ఉంటోంది. ఇదే అదునుగా దొంగలు రెచ్చిపోతున్నారు. సీసీకెమెరాలు పనిచేసే చోట కూడా నెల వ్యవధిలో మూడు చోరీలు జరిగాయి. కానీ పోలీసులు కేసులను ఛేదించడంలో సఫలీకృతం కాలేకపోయారు. అలాగే తిరుపతినాయుడుపల్లి, ఎన్వీకండ్రిక, వావిలేరులో మహిళ మెడల్లోని గొలుసులను దొంగలు అపహరించుకెళ్లారు. వీటికి సంబంధించి కేసులు నమోదయ్యాయి. కేసులను దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రాత్రి వేళల్లో గస్తీని పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చోరీలను కట్టడి చేయాలి



ఇటీవల కాలంలో దొంగలు చెలరేగిపోతున్నారు. రాత్రి వేళల్లో దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. మహిళల మెడల్లోని గొలుసులను అపహరించుకెళ్తున్నారు. పొలాల్లోని త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగితీగలను సైతం చోరీ చేస్తున్నారు. గ్రామాల్లో చిన్న చిన్న దొంగతనాలు కూడా జరుగుతున్నాయి. పోలీస్ అధికారులు స్పందించి చోరీలను కట్టడి చేయాలి. **–ఎస్‌కే కాలేషా, ఆదూరుపల్లి**

రాత్రి వేళ గస్తీ పెంచాలి

మండల కేంద్రమైన చేజర్లతో పాటు గ్రామాల్లోనూ రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు చేయాలి. ఇటీవల కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రజలు ప్రశాంతగా ఉండాలంటే పోలీసుల నిఘా ఉంచి దొంగలను పట్టుకోవాలి.

– కే రవిరెడ్డి, యనమదల

చోరీల కట్టడికి ప్రత్యేక నిఘా

మండలంలో చోరీలను కట్టడి చేసేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. రాత్రి వేళ గస్తీని పెంచుతాం. సీసీకెమెరాలతో నేరాలను కట్టడి చేయవచ్చు. దుకాణదారులు సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలి.

–జే తిరుమలరావు, ఎస్సై, చేజర్ల

ప్రజాభిప్రాయం మేరకే మైనింగ్‌కు అనుమతులు



అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ

వరికుంటపాడు: జంగంరెడ్డిపల్లె సమీపంలోని తిప్పపై తెల్లరాయి తవ్వకాలకు ప్రజాభిప్రాయం మేరకే అనుమతులు ఇవ్వడం జరుగుతుందని కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. వరికుంటపాడులో తహసీల్దార్ పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సబ్‌కలెక్టర్ పాల్గొన్నారు. భూసమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్‌ను జంగంరెడ్డిపల్లెకు చెందిన పలువురు కలిసి మైనింగ్ సమస్యను విన్నవించారు. తమ గ్రామ సమీపంలోని తిప్ప ప్రాంతంలో తెల్లరాయి తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నట్లుగా తెలిసిందన్నారు. తిప్ప సమీపంలో పాఠశాల, దేవాలయం, గ్రామం ఉన్నాయని తెలిపారు. తిప్పపైకి పశువులను మేతకు తోలుకెళ్లి జీవనం సాగిస్తున్నామన్నారు. తెల్లరాయి తవ్వకాలకు అనుమతులు ఇవ్వకుండా చూడాలని కోరారు. ఇందుకు స్పందించిన సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం శాంపిల్స్ సేకరిస్తున్నారని తెలిపారు. అనంతరం గ్రామసభ నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి మైనింగ్‌పై నిర్ణయం తీసుకుంటామని వివరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ గణేశ్వరాపురంలో ఆక్రమిత, వివాదాస్పద భూములను పరిశీలించారు. ఈ సమావేశంలో డీటీ చెంచయ్య, ఆర్‌ఐ యశ్వంత్‌కుమార్, సర్వేయర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపకరణాలకు నమోదు

ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాల నమోదు కోసం శనివారం ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు చక్రాల బండ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, తదితర ఉపకరణాలు అవసరమైన వారు సదరం సర్టిఫికెట్, రేషన్, ఆధార్‌కార్డులతో పాటు రెండు పాస్ ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

ఎంపీహెచ్‌ఓలను విధుల్లోకి తీసుకోవాలి

సోమశిల : ఎంపీహెచ్‌ఓలను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వైద్యారోగ్య సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు అనంతసాగరం పీహెచ్‌సీ సిబ్బంది భోజన విరామ సమయంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. పీహెచ్‌సీల్లో కీలకంగా సేవలు అందిస్తున్న ఎంపీహెచ్‌ఓలను తొలగించడం దారుణమని, వెంటనే ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ శ్రీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

80 పట్టణాల్లో ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలు



కావలి: కావలి ఆర్టీసీ డిపోలో కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను జిల్లా ప్రజా రవాణాధికారి మురళీ బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఏపీఎస్ ఆర్టీసీ సరకు రవాణా సేవలను ప్రారంభించిందని తెలిపారు. ఈ స్ఫూర్తితో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల ఆర్టీసీ సంస్థలు కార్గో సేవలను ప్రారంభించాయని వివరించారు. ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల ఆర్టీసీ అధికారులు ఏపీఎస్ ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను అధ్యయనం చేయడానికి వస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 80 పట్టణాల్లో ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలను ప్రారంభించిందని, 50 కేజీల వరకు డోర్ డెలివరీ చేస్తున్నట్లు వివరించారు. కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల సందర్భంగా ప్రతిఉద్యోగి కనీసం నలుగురి నుంచి డోర్ డెలివరీ పార్శిళ్లను బుక్ చేయించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు దివ్యకామాక్షి, కల్పన, ఖాజామొహిద్దీన్, బస్‌స్టేషన్ ఇన్‌చార్జి రమేష్‌బాబు, రీజియన్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పెంచలయ్య, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాకాణికి సన్మానం



ఆత్మకూరు: నెల్లూరులో శుక్రవారం జరిగిన జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆత్మకూరుకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సారథ్యంలో ఆత్మకూరులో పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సొసైటీ మాజీ అధ్యక్షుడు నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, పులిమి వెంకటరమేష్‌రెడ్డి, పాలేటి వెంగళరెడ్డి, గడ్డం శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నేడు జమ్మలపాళెం చెరువు చేపల వేలం

జలదంకి: జమ్మలపాళెం చెరువు చేపల వేలాన్ని శనివారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ బుర్రి శ్రీవేణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ సచివాలయంలో జరిగే బహిరంగ వేలంలో పాల్గొనే వారు ముందస్తుగా రూ.3 వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

యూటీఎఫ్ బ్యాగుల పంపిణీ



సీతారామపురం : స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు బ్యాగులు, వాటర్‌బాటిళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా వీటిని అందజేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భోగ్యం శ్రీనివాసులు, గొడ్లవీటి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి తిరుపతయ్య, గౌరవాధ్యక్షుడు రంతుజానీ, సురేష్, పీఏపీ కుమారి, పేరాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

12 మద్యం సీసాల స్వాధీనం

కావలి: మండలంలోని సర్వాయపాళెంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో కావలి ఎక్సైజ్ సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పంతంగి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వద్ద 12 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై ఎం దేవిక పాల్గొన్నారు.

సెమీక్రిస్మస్ వేడుకలు

సీతారామపురం: సీతారామపురం మండల సమాఖ్య ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఏపీఎం వైనారూత్ కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వెలుగు సీసీలు, వీఓఏలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

శనగ విత్తనాల పంపిణీ

వరికుంటపాడు: విరువూరు రైతుసేవా కేంద్రం పరిధిలో వర్షాలకు శనగ పంట దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఏఓ రవికుమార్ ఆధ్వర్యంలో శనగ విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగ విత్తనాలు క్వింటా ధర రూ.9,400 కాగా 80శాతం సబ్సిడీపై రూ.1880కే అందజేస్తున్నామని వివరించారు. వీఏఏలు శారద, చంద్రశేఖర్, శ్రీకాంత్, ఆదిత్య, పవన్ పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్లు వెంటనే ఇవ్వాలి

ఆత్మకూరు: అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల మండలాల్లోని వ్యవసాయ కనెక్షన్ల కోసం నగదు చెల్లించిన రైతులకు వెంటనే సర్వీసులు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆత్మకూరు డీఈఈ శ్రీనివాసులును రైతు సంఘ నాయకులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు మండలాల పరిధిలో 750 మంది రైతులు వ్యవసాయ కనెక్షన్ల కోసం నగదు చెల్లించి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు సర్వీసులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. రైతులకు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి కనెక్షన్లు ఇవ్వకపోతే డీఈఈ కార్యాలయాన్ని బాధిత రైతులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు.

పేదలకు దుప్పట్ల వితరణ

ఆత్మకూరు: పట్టణంలోని శాంతినగర్‌కాలనీలోని పేదలకు ఎద్దనమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని క్రిస్మస్‌ను పురస్కరించుకుని దుప్పట్లు అందజేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు పీ ఎడ్వర్డ్, చర్చి పాస్టర్ జాన్‌పాల్ తెలిపారు.

వసతిగృహంలో తనిఖీలు

సంగం: స్థానిక బీసీ బాలికల వసతిగృహాన్ని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ప్రసన్న శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేసి మెనూను పరిశీలించారు. భోజనం నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్ మల్లీశ్వరమ్మకు సూచించారు.

సీజేఎఫ్‌ఎస్ భూములపై సమగ్ర విచారణ చేపట్టాలి



గ్రామ సచివాలయం ఎదుట నిరసన తెలుసుకున్న ఎస్సీ కాలనీవాసులు

సీతారామపురం: అయ్యవారిపాళెంలో ఎస్సీలకు కేటాయించిన సీజేఎఫ్‌ఎస్ భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్సీకాలనీకి చెందిన పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు అయ్యవారిపల్లి గ్రామ సచివాలయంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి భూసమస్యలపై అర్జీలు స్వీకరించారు. మొత్తం 32 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా సీజేఎఫ్‌ఎస్ భూములకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని ఎస్సీకాలనీకి చెందిన పలువురు సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. 1972–76 మధ్య కాలంలో ప్రభుత్వం సీజేఎఫ్‌ఎస్ భూములు కేటాయించిందని తెలిపారు. 2018లో వాటిని ఆన్‌లైన్‌లో ఎక్కించే క్రమంలో కొందరు అధికారులు రికార్డుల పరిశీలన సక్రమంగా చేపట్టకుండానే ఒకరి భూమిని మరొకరి పేరుపై నమోదు చేశారని ఆరోపించారు. దీంతో భూ సమస్యలు ఉత్పన్నమయ్యాయని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామన్నారు.

జలదంకి: మండలంలోని జమ్మలపాళెం గ్రామసచివాలయంలో తహసీల్దార్ ప్రమీల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యలపై రైతులు 18 అర్జీలు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆర్‌ఐ శ్రీజ, సర్పంచ్ బుర్రి శ్రీవేణి, మాజీ సర్పంచ్ నక్కా మాదవరావు, వీఆర్వో ఫణి, పంచాయతీ కార్యదర్శి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు పిలుపు

ఉదయగిరి: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో శనివారం కేక్‌లు కట్ చేసి సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పార్టీ శ్రేణులకు శుక్రవారం పిలుపునిచ్చారు.

జలదంకి: జలదంకి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శనివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆత్మకూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు మేకపాటి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు కేక్ కట్ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కావలి: మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 8.30 గంటలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు.

In the Court of the Prinicipal Junior Civil Judge, Nellore
O.S.No.1126/2023
Andhra Pragathi Grameena Bank, (Erstwhile Pinakini Grameena Bank), Childerns Park Branch, Nellore represented by its Manager, - Plaintiff
Vs.
Shaik Sallena - Defendant
NOTICE
Shaik Sallena
W/o Shaik Ghouse Mohiddin, L.R. Palli, Atmakur, SPSR NelloreDist.
పై నెంబరు కేసు వాది మీ మీద బ్యాంకు లోన్ బాకీ రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసి యున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తేదీ 30.12.2024**న వాయిదా ఉన్నది. ఆ రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
K.V.సుబ్బారెడ్డి B.Com., B.L.,
అడ్వకేటు, నెల్లూరు.

సైబర్ నేరాలపై అవగాహన



అనుమసముద్రంపేట: స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఎస్సై సైదులు, ఏఎస్సై భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ



కావలి: కావలి మండల మాజీ ఎంపీపీ దామిశెట్టి పూర్ణచంద్రారావు, దగదర్తి మండల వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు వెలినేని మహేష్‌నాయుడు తండ్రి ఆరోగ్య సమస్యలతో నెల్లూరులోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా వారిని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. అలాగే పట్టణ వైస్సార్‌సీపీ నాయకుడు గయాజ్ ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా పరామర్శించారు.

ఆశీర్వచనం

పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌లో శుక్రవారం జరిగిన నక్క కుమార్ కుమార్తె వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన




ఉదయగిరిలో ప్రజాసంఘాల నిరసన


ఉదయగిరి/సోమశిల: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉదయగిరిలోని పంచాయతీ బస్టాండ్ సెంటర్, అనంతసాగరంలో సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఉదయగిరిలో సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరమన్నారు. అమిత్‌షా బేషరతుగా వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు కోడె రమణయ్య, ఫడ్స్ డైరెక్టర్ రమణయ్య పాల్గొన్నారు.

అల్లూరు: స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ సభ్యులు పప్పు సుధాకర్, పొంగులూరు చిన్నయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు




జీ సుధాకర్‌రెడ్డి




దేగా వంశీకృష్ణ



నారసింహారెడ్డి



డాక్టర్ ప్రణీత్



వీర రఘు

ఉదయగిరి/ ఆత్మకూరు/బిట్రగుంట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అనుబంధ విభాగాల్లో ఉదయగిరి, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాలకు చెందిన పలువురికి చోటు లభించింది. ఉదయగిరి నియోజకవర్గం చాకలకొండ ఎంపీటీసీ డేగా వంశీకృష్ణను జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా, వింజమూరుకు చెందిన అంకినపల్లి నారసింహారెడ్డిని పబ్లిసిటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా , ఆత్మకూరుకు చెందిన డాక్టర్ జే ప్రణీత్‌ను జిల్లా డాక్టర్స్ కమిటీ అధ్యక్షుడిగా, చేజర్ల మండలానికి చెందిన బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డిని జిల్లా బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడిగా, మర్రిపాడు మండలానికి చెందిన కొప్పోలు వెంకటేశ్వర్లును ఐటీ విభాగానికి, బోగోలు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మద్దిబోయిన వీర రఘును జిల్లా ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పదవీ బాధ్యతలు అప్పగించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఆత్మకూరుకు చెందిన డాక్టర్ జే ప్రణీత్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు జీ బాల అంకయ్య, నాయుడు అశోక్, తదితరులు అభినందనలు తెలిపారు.